# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 05-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్య సాధనలో వ్యవసాయరంగం కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ❖ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు.
- ❖ భారతదేశంలో పెద్ద మొత్తంలో తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడించారు.
- ❖ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం విజయవంతమైంది.

================================

అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్య సాధనలో వ్యవసాయరంగం కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ రోజు భువనేశ్వర్‌లో ఒడిశా వ్యవసాయ శాస్త్ర సాంకేతికత విశ్వవిద్యాలయం 40వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత కొన్ని దశాబ్దాల్లో భారతదేశం వ్యవసాయ రంగంలో అద్భుతమైన వృద్ధిని సాధించిందని, ఇతర దేశాలకు ఆహార ధాన్యాలు, వ్యవసాయ పరికరాలను ఎగుమతి చేస్తోందని అన్నారు. అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నానో టెక్నాలజీని వ్యవసాయం.. వ్యవసాయ రంగ సాధికారతకు ఉపయోగించాలని రాష్ట్రపతి తెలిపారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో కొత్త ప్రణాళికలను రూపొందించాలని శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు.

================================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం విజయవంతమైంది. ఈరోజు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ ఎల్వీసీ-59 రాకెట్ ప్రోబా-3 శాటిలైట్స్‌ను మోసుకెళ్లింది. సాయంత్రం 4 గంటల 04 నిమిషాలకు వాహకనౌక కక్ష్యలోకి ప్రవేశించింది. ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమ్‌నాథ్.. శాస్త్రవేత్తలకు

అభినందనలు తెలిపారు. కృత్రిమ సూర్యగ్రహణాన్ని సృష్టించేందుకు, సూర్యుని బాహ్య వలయంపై అధ్యయనం చేసేందుకు ఈ ప్రయోగం చేపట్టామని తెలుపుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు. ముంబై ఆజాద్ మైదాన్‌లో మూడోసారి మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఫడ్నవీస్‌తో ప్రమాణం చేయించారు. ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోమ్ మంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సహా పలువురు కేంద్రమంత్రులు, రాజకీయ నాయకులు హాజరైయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - భూటాన్ దేశాలు  విశిష్టమైన భాగస్వామ్యా సంబంధాలను కలిగి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. భూటాన్ దేశ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్ ఆయన భార్య క్వీన్ జెట్సన్ పెమా వాంగ్‌చుక్ తో కలసి రెండు రోజుల భారత్ పర్యటన నిమిత్తం ఈ రోజు ఢిల్లీ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా భూటాన్ రాజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఈ సమావేశంలో భూటాన్ పురోగతి, ప్రాంతీయ అభివృద్ధికి ఆ దేశ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్ తీసుకుంటున్న చర్యలను  ప్రధానమంత్రి కొనియాడారు. ఈ పర్యటన ఇరుదేశాల ద్వైపాక్షిక సహకారం, భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో పెద్ద మొత్తంలో తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని రష్యా అధ్యక్షులు వ్లాదిమీర్ పుతిన్ వెల్లడించారు. భారత ప్రభుత్వం ఇచ్చిన 'మేక్ ఇన్ ఇండియా' పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాస్కోలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి కోసం స్థిరమైన వాతావరణాన్ని పెంపొందించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాలు అద్భుతమని అన్నారు.  తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంగా రూపొందించిన "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని పుతిన్ పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశాల మధ్య యుద్ధ సమస్యల పరిష్కారానికి భారత్ మద్దతునిస్తుందని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఈరోజు పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ... ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న ఘర్షణలో పౌరుల ప్రాణాలు కోల్పోవడాన్ని భారత్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ముగింపు పలికి, శాశ్వత శాంతిని నెలకొల్పాలని పేర్కొన్నారు. చర్చల ద్వారా సంఘర్షణను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. పాలస్తీనా ప్రజలకు మానవతా సహాయం అందించాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి తెలుపుతూ....

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన రోడ్-కమ్-రైల్ వాహనాన్ని ఆ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మోటారు ట్రాలీ సౌకర్యాన్ని ఆధునీకరించడంపై రైల్వే ఉద్యోగులు, పర్యవేక్షకులతో సవివరంగా చర్చించిన తర్వాత దీనిని ఆవిష్కరించామన్నారు. ట్రాక్ నిర్వహణ కోసం గతంలో ఉపయోగించిన మోటార్ ట్రాలీ సౌకర్యం దశాబ్దాల నాటిదని, దాని స్థానంలో నూతన మోటార్ ట్రాలీని తీసుకువచ్చామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా 157 విమానాశ్రయాలు పని చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. 2014లో కేవలం 74 విమానాశ్రయాలు మాత్రమే పని చేశాయని అన్నారు. ఈరోజు లోక్‌సభలో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం దేశవ్యాప్తంగా విమానాశ్రయ నెట్‌వర్క్‌ను విస్తరించిందని అన్నారు. “ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్”, “ఉడాన్ పథకం” విమానయాన రంగంలో విప్లవాత్మక పథకాలని అన్నారు. దేశీయ విమానయానం ఒక్క రోజులో 5 లక్షల మంది ప్రయాణికుల చేరవేసిన మైలురాయిని చేరుకుందని కేంద్రమంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే మరికొన్ని రైళ్లను నడపనుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్న రైల్వే అధికారులు.. భక్తుల రద్దీ దృష్ట్యా తాజాగా మరో 28 రైళ్ల సర్వీసులు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లోని మౌలాలి నుండి కొల్లం, కాచిగూడ నుండి కొట్టాయం, కాకినాడ టౌన్ నుండి కొల్లం, నర్సాపుర్ నుండి కొల్లంకు ఈ రైళ్లు నడపనున్నారు. ఈనెల 11 నుండి జనవరి 29వ తేదీ వరకు నిర్ణీత తేదీల్లో ఈ రైళ్లు సేవలందించనున్నాయి. ఈ రైళ్లకు అడ్వాన్స్ బుకింగ్స్ రేపు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతాయని అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దార్శనికుడు డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ విలువలు నైతికతను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అన్నారు. ఈరోజు ఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వెనుకబడిన వర్గాల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. అంబేద్కర్ సామాజిక సాధికారత కోసం మాత్రమే కాకుండా భారతదేశ ఆర్థిక వ్యవస్థకు పునాది వేశారని ఆయన తెలిపారు. 2017లో ఢిల్లీలో స్థాపించబడిన డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ అనేక పథకాలు, కార్యక్రమాల ద్వారా అంబేద్కర్ ఆదర్శాలను ప్రపంచానికి తెలియజేస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జూనియర్ ఆసియా కప్-2024 టైటిల్‌ను గెలుచుకున్న పురుషుల హాకీ జట్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు అభినందించారు. ఈ విజయం భారత హాకీకి చారిత్రాత్మక క్షణం అని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. యువ ఆటగాళ్ల అసమాన నైపుణ్యం, సమిష్టి కృషి ఈ విజయాన్ని క్రీడా కీర్తి చరిత్రలో చేర్చాయని ఆయన అన్నారు. యువ ఛాంపియన్‌లు భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షిస్తూ.. శుభాకాంక్షలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =